# ఆ ప్రశ్నకెవ్వరూ జవాబు చెప్పరు

ఎవరొస్తేనేం, ఎవరుపోతేనేం, ఎవరైతేనేం, అనుకుందికి మరి మావూరు మహాపట్నం కాదుకదండీ! ఓ కొత్త మనిషెవరైనా ఊళ్ళో అడుగుపెట్టేడూ అంటే ఆపాదమస్తకం అతణ్ణి పరీక్షించి "మీరెవరు, ఏ వర్ణం మీది, ఏ వూరు, ఈవూరెందుకొచ్చేరు, ఎన్నాళ్ళుంటారు, అసలు మీ పనేమిటి, మీకు పెళ్ళయిందా, అవకపోతే ఎందుకవలేదు, ఒకవేళ పెళ్ళయితే ఏవూరు పిల్ల, పిల్లలున్నారా, ఎంతమంది, ఆడపిల్లలెందరు, మొగపిల్లలెందరు, ఫలానావారు మీకేమైనా అవుతారో" ఇటువంటి ప్రశ్నల్తో అతణ్ణి చంపిమరీ వదిలిపెడతారు. ప్రశ్నలకి జవాబులు చెప్పకుండా ఆ బ్రహ్మదేవుడైనా తప్పించుకోలేడంటే నమ్మండి! వూళ్ళో అడుగుపెట్టిన మూణ్ణిముషాల్లో వాడి చరిత్రా, వాడి వంశ చరిత్రా అందరికీ వెల్లడయిందన్నమాటే!

అందుకనే నాకాశ్చర్యం వేసేది, ఆవిడ మావూరొచ్చి చాలా రోజులయినా ఏ వొక్కడికీ తన భోగట్టా ఈషణ్మాత్రమైనా తెలియనివ్వకుండా ఎలా తప్పించుకుందా అని.

అయితే మావూరి ప్రజానీకం ఆవిడ పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకుందికి ప్రయత్న లోపం ఎంతమాత్రం చెయ్యలేదు. ఆవిణ్ణి అనేక రకాలుగా ప్రశించేరు. సూటీ ప్రశ్నలు వేసేరు. డొంక తిరుగుడుగా అడిగిచేసేరు. నానాతంటాలూ పడ్డారు. ఆడా మొగా భేదం లేకుండా పెద్దలూ పిన్నలూ అంతా కలిసి ప్రశ్నల పరంపర కురిపించినా ఆవిడ లొంగలేదు. చివరకంతా విసుగెత్తి ఊరుకున్నారు.

మావీధి చివర ఓ పాడు పూరిల్లు అద్దెకి తీసుకుని ఆవిడ ఉండేది. ఆవిడతో ఓ అయిదేళ్ళ ఆడపిల్ల కూడా ఉండేది. ఆవిళ్ళాగే ఆ పిల్లకూడా లక్షణంగా ఉండడంచేత ఆ అమ్మాయి ఆవిడ కూతురే అయివుంటుందని అంతా అనుకున్నాం. ఆవిడ మొహాన్న బొట్టు ఎప్పుడూ ఉండకపోవడం చేత ఆవిడ భర్త పోయి వుంటాడని ఊహించుకున్నాం; అంతే ఆవిడ గురించి తెలుసుకున్న భోగట్టా. ఆవిడెవరో, ఏ వూరో, ఎందుకిక్కడికి వచ్చిందో, ఎలా జీవిస్తుందో ఈ విషయాల గురించి ఎవరికీ ఏమీ తెలియదు.

ఆవిడ చాలాపొట్టిగా చామనఛాయగా వున్నప్పటికీ విశాలమైన కళ్ళు, సూదిముక్కు, ఎర్రటి పెదవులూ, ఉండడంచేతా, నడుస్తున్నప్పుడు భారంగా ఉండే ఆమె రొమ్ములూ, పిరుదులూ అందంగా కదలడం చేతా ఆవిడ ఆకర్షణీయంగా ఉండేది. ఆవిడ వృత్తాంతం తెలుసుకుందామనే కుతూహలంతోపాటు, ఆవిడ అందంగా ఉండడంచేత ఆవిణ్ని పాడు చేద్దామనే దురుద్దేశం కూడా మావూళ్ళో చాలామందికి కలిగింది. ఆవిడకి ఉత్తరాలు రాసేరు. కబుర్లు పంపేరు. వెంటాడేరు. ఇంటి ముందూ వెనకా పచార్లు చేసేరు. ఎవర్నీ దగ్గర చేరనియ్యలేదావిడ. కన్నెత్తి చూడలేదు. కొన్నాళ్ళకి నిప్పులాంటి మనిషనే ఖ్యాతి గడించింది.

ఏడాది అయ్యేసరికి ఆవిడ మా వూరికి పాతబడిపోయింది. రోజూ జరిగే బాతాఖానీలో ఆవిడ వూసు ఎత్తుకోడం మానేసారు. మామూలుగా ఆవిడ మానాన్న ఆవిడ, మా మానాన్న మేమూ ఉంటూ వచ్చేం. అయితే ఓనాడు ఉదయం మళ్ళీ గుసగుసలు ప్రారంభమయేయి. ఎందుకంటారా?

అతను మా ఇంటి ప్రక్కన ఉండేవాడు. మూడుసార్లు పెళ్ళి చేసుకుంటే, ముగ్గురు పెళ్ళాలూ చనిపోయేరతనికి. ముగ్గురి దగ్గరా కట్నాల్లాగి ముగ్గుర్నీ చంపేశాడని ప్రతీతి. కాని పరకా ఉన్నవాడు. పిల్లాజెల్లా లేనివాడు అప్పటికతను వొంటరిగానే ఉంటూన్నా రహస్యంగా చాలామందితో సంబంధం ఉన్నదని ఊళ్ళో అనుకునేవారు. రూఢిగా ఏమీ తెలియకపోయినా అందరికీ అతనంటే అనుమానం. వేలెత్తి చూపించడానికి మాత్రం ఏమీ దొరికేది కాదతని ప్రవర్తనలో. అతడు అందరితోను కలిసి మెలిసి పెద్దమనిషి తరహాగా తిరిగేవాడు

అతని పెరడూ మాపెరడూ కలిసే ఉంటాయి. నామకార్థం రెండింటి మధ్యా పడిపోతూన్న ఓ పాతగోడ ఇంకా నిల్చి ఉన్నదంతే. ఎవరి పెరట్లో ఏం జరిగినా రెండోవాళ్ళకంతా స్పష్టంగా కనిపిస్తుంది. ఓనాడు పొద్దున్నే లేచి చూద్దును గదా, ఆవిడ పెరట్లో నూతిపక్క రోటిలో ఏదో రుబ్బుతూంది నేనాశ్చర్యపడ్డానంటే మరేం ఆశ్చర్యం లేదు. నాకేం తలాతోకా అందలేదు. ఆ క్షణాన్నే కేకేసి ఆవిణ్ణీ అడుగుదామనుకున్నాను. కాని ఎందుకో జంకేను. కాని అతి త్వరగా అతణ్ణీ కలుసుకుని ఇదేమిటంకోయ్ అని అడిగేశాను.

అడిగితే చెప్పేడు. అతనింట్లో వంటమనిషిగా కుదురుకుందిట. మకాం కూడా అక్కడికే మార్చేసిందట.

అప్పట్నుంచీ మా వూళ్ళో ఆవిడ గురించి మళ్ళీ గుసగుసలు ప్రారంభించాయి.

"అసలు వంట చెయ్యడానికా ఏమిటి? సంగతంతా వేరే ఉందిలే. ఎవరికి తెలీదు!"

"అయితే ఇన్నాళ్ళూ నిప్పులా ఉన్న మనిషి ఇప్పుడేం చెప్మా ఇలా తయారయింది!"

"ముద్దకి లేదు కాబోసు"

"అయినా మనవాడెలా పట్టాడో?"

"ఎలా పట్టాడో తెలియదుగాని, ఛాన్సు మాత్రం గొప్పది కొట్టేడు."

ఇలాగే ప్రతీ ఇంట్లోనూ సంభాషణ జరిగిందంటే నమ్మండి. నాకు మాత్రం ఎందుచేతనో ఆవిడ చాలా మంచిమనిషని గట్టి నమ్మకం ఉండేది. మనిషి పైకి గంభీరంగా ఉన్నా నిజంగా చాలా అమాయకురాలిగా అనిపించేది. ఆవిడ ఎందుకిలా వాడింటికి వచ్చిందా అని నేను తర్కించుకుంటూండగా ఓసారి పెరట్లో ఆవిడ కూతురికి స్నానం చేయిస్తూ అవుపించింది.

చూడగానే నా గుండె కరిగిపోయింది.

ఆ పిల్లకి వంటిని ప్రాణంలేదు, ఎముకలన్నీ 'ఒకటీ, రెండూ, మూడూ' అని అతి సులువుగా లెక్కెట్టొచ్చు, కళ్ళు లోతుకి పోయాయి. పిల్ల కొనవూపిరితో ఉన్నది. తల్లిని చూస్తే శుభ్రంగా పాలిపోయి నీరసంగా అవుపిస్తోంది. మనిషేదో బాధ పడుతున్నట్టుంది.

తిండిలేదు. ముమ్మాటికీలేదు. దారిద్ర్యం అంతటికీ కారణం. ప్రస్తుతం అతనేదో

డబ్బిస్తానని ఉంటాడు. కాని వట్టినే ఇస్తాడా?

వెన్నెలరాత్రిలో, రాత్రి భోజనాలయేక ఆవిడ పెరట్లో కంచాలు కడుగుతూంది. అంతా నిశ్శబ్దం. కొబ్బరి ఆకుల్లోంచి చంద్రకిరణాలు ఆవిడమీద పడి ఆడుకుంటున్నాయి. కడుగుతున్న వెండి కంచాలు తళతళ మెరుస్తున్నాయి. నేనలాగే నిల్చుని చూస్తున్నాను చెట్టునీడ నుంచి. అతను కూడా అప్పుడే చుట్ట కాల్చుకుంటూ వచ్చి రెండు పీల్పులుపీల్చి పారేశాడు. మెల్లగా వెనకనుండి వంగుని పనిచేస్తున్న ఆవిడ భుజాలమీద చెయ్యి వేసేడు. ఆవిడ తుళ్ళిపడింది. అతన్ని చూసి పైట సర్దుకోబోయింది. అతను రెండు చేతులూ పట్టుకున్నాడు. ఆవిడలాగే నిల్చుంది. ముఖంలో ఎటువంటి భావమూ నాక్కనిపించ లేదు. రాయిలా అలాగే నిల్చున్నది. పాలిపోయినప్పటికీ ఇంకా అందంగానే ఉన్నది ముఖం. భుజాలు నీరసంగా జారిపోయేయి. మనిషిలో పూర్వపు దారుఢ్యంలేదు. శక్తిహీనంగా నిల్చున్న ఆవిణ్ణి అలాగే వక్కసారి కౌగలించుకున్నాడతడు. చడీ చప్పుడూ లేకుండా నేనింట్లోకి వచ్చేశాను.

అతను డబ్బు వట్టినే ఇవ్వడంలేదు, అది స్పష్టం.

అయితే -

నాలుగు వారాల్లో ఆవిడ కూతురు నవనవలాడుతూ పనసపండులా తయారయింది. నాకు చూడ్డానికెంతో ముచ్చట వేసింది. పాపం ఆ పిల్లకి తన గురించి ఆవిడ ఎంత త్యాగం చేస్తూందో తెలీదు. హాయిగా, ఆరోగ్యంగా ఆడుకుంటూంది.

ఆర్నెల్లయింది.

ఓనాడు పొద్దుటే ఇంకా కొద్దిగా చీకటి ఉండగానే ఆవిడ శవాన్ని ఊళ్ళో చెరువులోంచి జాలర్లుపైకి తీసేరు. గర్భవతి శవం అది.

మరొక అమాయక శిశువుని ఈ భూమ్మీద కష్టాలపాలు చేయకుండా ఆవిడ వెళ్ళిపోయింది.

శవాన్ని అతనింటి ముందే పడేశారు. వొళ్ళంతా మాత్రం తెల్లటి గుడ్డతో కప్పేరు.

చుట్టూ జనం మూగి చూస్తున్నారు. ఎవరైనా మాట్లాడితే ఒట్టు మృత్యువు ముందు భయంతో నిల్చున్నారంతా.

అప్పటికి బాగా తెల్లవారింది.

లోపల్నుంచి కళ్ళు నులుపుకుంటూ ఆవిడ కూతురు వచ్చి అతడి పక్క నిల్చుంది. అందరి కళ్ళూ ఆ పిల్లమీద ఉన్నాయి.

గుడ్డకప్పిన శవాన్ని చూసి నవ్వుతూ అడిగిందా పిల్ల.

"అదెవరూ? అలా దార్లో బజ్జున్నారు?"

ఆ ప్రశ్నకెవరూ జవాబివ్వలేదు.